క్లుప్తంగా

మానవ జీవనానికి బృహతితో మేలు



బృహతి సహస్ర యాగం నిర్వహిస్తున్న మధ్వ పండితులు

బోట్‌క్లబ్‌: బృహతి సహస్ర యాగం వల్ల మానవులకు ఎంతో మేలు చేకూరుతుందని ఉత్తరాది మఠ ప్రత్యేక అధికారి, సుధా పండితుడు కానుగోవి వాసుదేవాచార్‌ అన్నారు. కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న బృహతి సహస్ర యాగాన్ని శనివారం ప్రారంభించారు. చైత్రమాసం శ్రీరామ మాసంగా ప్రసిద్ధి చెందిన సమయంలో ఈ యాగాన్ని నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ హోమంలో సుధా పండితులు విజయ సింహాచార్‌ (రాజమహేంద్రవరం) రఘోత్తమాచార్‌ (విజయనగరం) సుమంత్‌ ఆచార్‌ పాటిల్‌ (విజయవాడ) రఘు ప్రేమాచార్‌ (గుంటూరు) హిందూ ధర్మ గురు పండిత హెచ్‌ శ్రీహరే రామాచారి (హైదరాబాద్‌) స్థానిక మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్‌ పాల్గొన్నారు.

సెబ్‌ స్టేషన్‌లో తనిఖీలు



నార్త్‌ సెబ్‌ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న జాయింట్‌ కమిషనర్‌ నాగలక్ష్మి

కాకినాడ క్రైం: స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో రాష్ట్ర జాయింట్‌ కమిషనర్‌ టి.నాగలక్ష్మి శనివారం కాకినాడలోని నార్త్‌ సెబ్‌ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు ఫైళ్లను పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.బి.పెద్దిరాజు ఆయన బృందాన్ని అభినందించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో సెబ్‌ అదనపు ఎస్పీ శ్రీ లక్ష్మి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల వేళ మద్యం విక్రయాలు, అక్రమ తరలింపుపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అందుకు తగ్గ మార్గనిర్దేశకాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సెబ్‌ అధికారులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం

కాకినాడ రూరల్‌: స్థానిక రమణయ్యపేట మార్కెట్‌ వీధి, కాపుల రామాలయం వద్ద సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో నవమి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం పందిరి దాట వేశారు. ఉత్సవ నిర్వాహకులు ఐరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన జరిగే శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐరెడ్డి సత్యనారాయణ దంపతులు, అలాగే నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పాలూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోరమాండల్‌ ఉద్యోగుల కొత్త కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న యూనిట్‌ మేనేజరు శ్రీనివాసరావు

కాకినాడ రూరల్‌: కోరమాండల్‌ ఇంటర్నేషనల్‌ లిమిటెడ్‌ కర్మాగారం ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కార్యవర్గ అధ్యక్షుడిగా నూకరాజు, ఉపాధ్యక్షుడిగా దాసు, జనరల్‌ సెక్రటరీగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎండీ బషీర్‌ బాషా, కోశాధికారిగా మదన్‌, ప్రచార కార్యదర్శిగా గౌతమ్‌ లెనిల్‌ ఎన్నికయ్యారు. వీరిని కోరమాండల్‌ యూనిట్‌ మేనేజరు శ్రీనివాసరావు, హెచ్‌ఆర్‌ మేనేజర్‌ పద్మనాభం తదితరులు అభినందించారు.

ఎన్నికల్లో అన్నిచోట్లా పోటీ

బోట్‌క్లబ్‌: వచ్చే నెలలో జరిగే ఎన్నికలలో జై భీమ్‌ రావ్‌ భారత్‌ పార్టీ కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంటులో పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జె.మల్లికార్జున తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన పాలన రావాలంటే తమ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కాకినాడ సిటీ తరపున న్యాయవాది గింజాల చక్రవర్తి పోటీ చేస్తారని ఆయన తెలిపారు. అభ్యర్థి చక్రవర్తి మాట్లాడుతూ నగరంలో ప్రజలకు రోడ్లు, డ్రైన్లతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి జి.హరీష్‌ పాల్గొన్నారు.

ఉప్పలంకలో ప్రచారం

కరప: మండలం ఉప్పలంక, శివారు మొండి గ్రామాల్లో శనివారం నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ ఆయా పార్టీల నాయకులతో కల్సి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ కో–కోఆర్డినేటర్‌ కటకంశెట్టి బాబీ, నులికుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్‌తోనే జనరంజక పాలన



పాస్టర్‌ రాజాజీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, మాజీ కార్పొరేటర్‌ మణికుమార్‌

కరప: జగనన్నతోనే జనరంజక పాలన సాధ్యమని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. కరప వైఎస్సార్‌ కమిటీ ఆధ్వర్యంలో వారు శనివారం నీలయ్యతోట, సామిల్లు ప్రాంతం, కొత్తపేట తదితర వీధుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. సీఎం జగన్‌ అమలుచేసిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని, గ్రామంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన అభివృద్ధి పనులను వివరించి ప్రజలకు మరింత మేలు జరగాలంటే ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబును, ఎంపీ అభ్యర్థి సునీల్‌ను గెలిపించి తద్వారా జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని వారు కోరారు. సర్పంచ్‌ సాదే ఆశాజ్యోతి, వైస్‌ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, పార్టీ నాయకులు చిన్నారి మురళి, పేపకాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీతోనే ముస్లింల అభ్యున్నతి

వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంతోనే ముస్లింలు అన్ని విధాలా అభ్యున్నతి సాధించారని జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి కరీం బాషా పేర్కొన్నారు. సీఎం జగన్‌ అమలుచేసిన పలు సంక్షేమ పథకాల ద్వారా ముస్లింలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కరప మండలం వేళంగి, చినకొత్తూరు గ్రామాల్లో శనివారం ఆయన ముస్లిం సామాజికవర్గ పెద్దలతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు ముస్లింలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించి రానున్న ఎన్నికల్లో కన్నబాబు, సునీల్‌లను గెలిపించాలని కోరారు. మండల కోఆప్షన్‌ సభ్యుడు షేక్‌ దరియా,



చినకొత్తూరులో గ్రామ కమిటీ అధ్యక్షుడు బుజ్జితో కలసి ఎన్నికల ప్రచారం చేస్తున్న ముస్లిం పెద్దలు

పార్లమెంట్‌ జనరల్‌ సెక్రటరీ ఎండీ సంధానీ, కాకినాడ రూరల్‌ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్‌ వల్లీ, పార్లమెంట్‌ మైనార్టీ సెల్‌ సెక్రటరీ ఎండీ మదీనా, ఎండీ కాజా మెహిద్దిన్‌, ఎండీ మదీనా సాహెబ్‌, జవ్వాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గొడారిగుంట నుంచి..

కాకినాడ రూరల్‌: కాకినాడ 3వ డివిజన్‌లోని గొడారిగుంటకు చెందిన పలువురు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్‌ ఆధ్వర్యంలో మడికి గోపి, సత్తిబాబు తదితరులు పెద్ద ఎత్తున వైఎస్సార్‌ సీపీలో శనివారం చేరారు. అంబేడ్కర్‌ జయంతిని పురస్కరించుకుని పాస్టర్‌ రాజాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్‌ విగ్రహ ఆవిష్కరణకు ఆదివారం విచ్చేయవల్సిందిగా కన్నబాబును మణికుమార్‌ తదతరులు కోరారు. పార్టీ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, తిమ్మాపురం సర్పంచ్‌ బెజవాడ సత్యనారాయణ, నేరెళ్ళ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో భారీగా చేరికలు



12వ డివిజన్‌ నుంచి పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న ఎస్సీ నాయకులు

కాకినాడ: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో పలువురు నాయకులు శనివారం వైఎస్సార్‌ సీపీలో చేరారు. ఆర్మీ మెడికల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎల్లబోయిన విష్ణు బాబు, మరికొందరు పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్‌ ఎలబోయిన చిన్న తదితరులు ఈ కార్యక్రమంలో వీరి వెంట ఉన్నారు. స్థానిక 12వ డివిజన్‌ పరలోపేట, వాడపేట ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది జనసేన, టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌ సీపీలో చేరారు. స్థానిక పార్టీ నాయకులు బోదిరెడ్ల పుష్ప పరశురాం ఆధ్వర్యంలో చేరిన వారికి ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్‌, ఎమ్మెల్యే ద్వారంపూడి విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ కూటమి అనైతిక విధానాలతో విసిగిపోయిన ఎంతోమంది ఆయా పార్టీలకు గుడ్‌ బై చెప్పి వైఎస్సార్‌ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరినవారంతా సీఎం జగన్‌ మరోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎస్సీ నేతలు

వైఎస్సార్‌ సీపీ జిల్లా ఎస్సీ సెల్‌ చైర్మన్‌ శెట్టిబత్తుల కుమార్‌ రాజా, రాష్ట్ర ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శి బత్తుల భీమారావు శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ సెల్‌ తరపున ఆయా ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేసే అంశంపై చర్చించారు. ఎస్సీల అభివృద్ధికి సీఎం జగన్‌ అమలు చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. ఎస్సీ సెల్‌ ప్రధాన కార్యదర్శి అరిగెల దొరబాబు తదితరులు వీరి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడిని ఎస్సీ నాయకులు ఘనంగా సత్కరించారు.

సీబీసీఎన్‌సీ ఎదుట క్రైస్తవుల నిరసన

కాకినాడ: అన్యాక్రాంతమవుతున్న వేలకోట్ల విలువైన సీబీసీఎన్‌సీ ఆస్తులను కాపాడాలని కోరుతూ కార్యాలయం ఎదుట వివిధ ప్రాంతాల క్రైస్తవులు శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జ్యోతికుమార్‌రెడ్డి, డాక్టర్‌ బీహెచ్‌వీ మూర్తిరాజు, మేరాజేసుదాస్‌ విలేకర్లతో మాట్లాడుతూ సీబీఎం కాంపౌండ్‌లోని పురాతన భవనాలను కూల్చివేసి విలువైన కలపను సైతం అక్రమంగా తరలిస్తున్నారన్నారు. దైవ సేవకుల ముసుగులో కొంత మంది చేస్తున్న భూకబ్జా యత్నాలను అడ్డుకుని మిషనరీ ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేరు చెప్పుకుని ఆస్తులు కైంకర్యం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంతో ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిరసనలో క్రైస్తవ ప్రతినిధులు జాన్‌, విజయ్‌కుమార్‌, సీరం ఐజక్‌, జాన్‌ వెస్లీ, స్టీఫెన్‌ ఆనంద్‌, దడాల జాషువాగిరి, రిక్కీ గూటం తదితరులు పాల్గొన్నారు.



సీబీసీఎన్‌సీ ఎదుట నిరసన తెలియజేస్తున్న క్రైస్తవ ప్రతినిధులు

రీ పోలింగ్‌ పరిస్థితి రానీయొద్దు

- ఎన్నికల నిర్వహణ బాధ్యత పీఓ, ఏపీఓలదే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ నివాస్‌

పెద్దాపురం: ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన అవసరమని, ఎన్నికల నిర్వహణ బాధ్యత పీఓ, ఏపీఓలపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ జె.నివాస్‌ అన్నారు. పెద్దాపురం లూథరన్‌ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓల శిక్షణ తరగతులను శనివారం ఆయన పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో జేవీఎస్‌ రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ నివాస్‌ మాట్లాడుతూ నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. భారత ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, కమిషన్‌ నిబంధనలపై మరింత పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్‌ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని కలెక్టర్‌ ఆదేశించారు. పోలింగ్‌ సమయంలో పీఓ, ఏపీవోలు సమన్వయంతో పని చేయాలన్నారు. పోలింగ్‌ ప్రక్రియ ప్రారంభానికి ముందు నిర్వహించే మాక్‌పోల్‌ అత్యంత కీలకమని, సిబ్బంది అప్రమత్తత అవసరమన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ పనితీరు, పీఓ డైరీ, ఇతర డ్యాకుమెంట్లు పూర్తి చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఓ, ఏపీఓలు పోలింగ్‌ ప్రక్రియలో ఎటువంటి తప్పులకు తావులేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్‌ నివాస్‌ సిబ్బందికి సూచించారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్‌ ప్రక్రియ ఏర్పాటు, పోలింగ్‌ అధికారుల విధులు, ఓటింగ్‌ కంపార్టుమెంటు, బ్యాలెట్‌ బాక్సుల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక మహారాణి కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల భద్రతా గదులు పరిశీలించి ఆర్డీఓ, ఆర్‌ఓ జేవీఎస్‌ రామారావుకు పలు సూచనలిచ్చారు.



పెద్దాపురం పీఓ, ఏపీఓల శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్‌ నివాస్‌

అనైతిక కూటమిని తరిమికొట్టండి

- ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి

కాకినాడ: ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేని టీడీపీ, బీజేపీ, జనసేన అనైతిక కూటమిని రానున్న ఎన్నికల్లో తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. స్థానిక 12 డివిజన్‌ డైరీఫారం సమీపంలోని సంజయ్‌నగర్‌ ఏఎంజీ స్కూల్‌ నుంచి శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్వర్ణాంధ్ర కాలనీ కొత్త పాకల మీదుగా ప్రచారం కొనసాగింది. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి ఎన్నికలలో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం, సీఎం జగన్‌, ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులపై తిట్ల పురాణమే తప్ప ప్రజల కోసం ఏం చేస్తామో చెప్పలేని దుస్థితిలో కూటమి పార్టీలు ఉన్నాయన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఆయన ఓటర్లను కోరారు. అనేక పాలనా సంస్కరణల ద్వారా సీఎం జగన్‌ ఆంధ్రప్రదేశ్‌ ప్రతిష్టను దేశమంతా చాటి చెప్పారన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌ అభివృద్ధికి చేసిన కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి వెంట స్థానిక నాయకులు మట్టపర్తి రఘురాం, జితేంద్ర సింగ్‌, బొద్దిరెడ్ల పుష్ప పరశురాం, కోనాడ దుర్గాప్రసాద్‌, మాదిరెడ్డి పద్మ తదితరులు ఉన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ద్వారంపూడిని మళ్లీ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి ప్రచారం

కాకినాడ: గడచిన ఐదేళ్లలో తన భర్త ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె 41వ డివిజన్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చాగంటి వారి వీధి, రెడ్‌ క్రాస్‌ వీధి, ఓలేటి వారి వీధి, ప్రతాప్‌ నగర్‌ మెయిన్‌ రోడ్‌ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేశారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సీఎం జగన్‌ చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మరోసారి వైఎస్సార్‌ సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా కాకినాడను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దిన ద్వారంపూడికి హ్యాట్రిక్‌ విజయాన్ని అందించాలని ఆమె కోరారు. స్థానిక మాజీ కార్పొరేటర్‌ గోడి సత్యవతి వెంకట్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొడా చైర్‌పర్సన్‌ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్‌ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్‌ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు ఇనుకొండ పట్టాభిరామయ్య, దండు మహంతి లక్ష్మణరావు, పెద్దిరెడ్డి రామలక్ష్మి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న మహాలక్ష్మి, నాయకులు

ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర కీలకం

- పీవో, ఏపీఓలకు రెండో రోజు శిక్షణ
- పర్యవేక్షించిన ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల విధులపై ప్రిసైడింగ్‌, అసిస్టెంట్‌ ప్రిసైడింగ్‌ అధికారులకు శనివారం కూడా శిక్షణ కొనసాగింది. స్థానిక పీఆర్‌ ప్రభుత్వం కళాశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఈఆర్వో జే వెంకటరావు పర్యవేక్షించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన శిక్షణ సాయంత్రం వరకు కొనసాగింది. ఎన్నికలు జరిగే ముందు రోజు, ఎన్నికల జరిగే రోజున సిబ్బంది విధులపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాస్టర్‌ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో చట్టపరమైన, సాంకేతిక అంశాలు, ఎన్నికల విధుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నిబంధనలు, ఈవీఎం, వీవీ ప్యాట్ల పనితీరు సహా అనేక అంశాలపై ఈ శిక్షణ ఇచ్చారు. ఈఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించడంలో పీవో, ఏపీఓల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. మలివిడత శిక్షణలో భాగంగా ఈ నెల 15, 16వ తేదీలలో ఓపిఓలకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. మొత్తం సుమారు 3,300 మందికి ఈ శిక్షణ ఇచ్చామని ఆర్వో వెంకటరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌ గుంటూరు శేఖర్‌, తహసీల్దార్‌ చల్లన్న దొర, ఇతర ఎన్నికల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రిసైడింగ్‌, అసిస్టెంట్‌ ప్రిసైడింగ్‌ అధికారులశిక్షణలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

కాకినాడ రూరల్‌: ఎన్నికల విధుల పట్ల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఈఆర్వో ఇట్ల కిశోర్‌ కోరారు. కాకినాడ విద్యుత్‌ నగర్‌ ఐడియల్‌ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎన్నికల విధులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 751 మంది ప్రిసైడింగ్‌, సహాయ ప్రిసైడింగ్‌ అధికారులకు రెండు రోజులు శిక్షణలో పూర్తిగా అవగాహన కల్పించామన్నారు. శిక్షణలో భాగంగా ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ విజయప్రసాద్‌, డిప్యూటీ తహసీల్దార్‌ సురేష్‌, ఆర్‌ఐ మధు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతుల్లో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఈఆర్వో కిశోర్‌

ఏపీపీ, ఏజీపీలకు సమాచారం లేదు

- ఈనాడు కథనం అవాస్తవం

కాకినాడ: కోడ్‌ ఉల్లంఘన ఫిర్యాదుకు సంబంధించి విచారణకు గైర్హాజరైనట్లు ఈనాడు దినపత్రికలో వచ్చిన కథనం వాస్తవం కాదని కాకినాడకు చెందిన ఏజీపీలు, ఏపీపీలు స్పష్టం చేశారు. శుక్రవారం సదరు పత్రికలో వచ్చిన కథనంపై ఏజీపీలు బచ్చు రాజేష్‌, గెద్దాడ వెంకటేశ్వరరావు, ఏపీపీలు కె.ఆదిత్య కుమార్‌, ఎం.విశ్వేశ్వరరావు, పితాని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఖండించారు. వైఎస్సార్‌ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను కొంతమంది న్యాయవాదులు కలిసిన అంశంపై నియోజకవర్గ ఏఆర్‌ఓ చల్లన్నదొర సమక్షంలో బీజేపీ నేతలు మాత్రమే హాజరయ్యారని, ఏజీపీ, ఏపీపీలు గైర్హాజరయ్యారనడం సరికాదన్నారు. విచారణకు హాజరు కావలసిందిగా తమకు ఎటువంటి నోటీసులు కానీ, సమాచారం కానీ అందలేదని వీరు స్పష్టం చేశారు. వాస్తవాన్ని వక్రీకరించి తామంతా గైర్హాజరైనట్లు ప్రచారం చేయడం సరికాదని ఆ ప్రకటనలో ఖండించారు.

పోలీసు బలగాలతో కవాతు



యండమూరులో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న రూరల్‌ సీఐ శ్రీనివాస్‌

కరప: రాష్ట్రంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కె.శ్రీనివాస్‌ కోరారు. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ సతీష్‌కుమార్‌ ఆదేశాల మేరకు శనివారం కరప మండలం వేళంగి, యండమూరు, ఉప్పలంక గ్రామాల్లో కేంద్ర పోలీస్‌దళాలు, సివిల్‌ పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్‌ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు భద్రత, భరోసా కల్పిస్తామన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరికీ తగిన రక్షణ కల్పించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

శ్రీవారి నామస్మరణం ఏడేడు జన్మల పాప పరిహారం

బోట్‌క్లబ్‌: చిత్తశుద్ధి కలిగి, ఆర్తితో ఏడు కొండలవాడా వేంకట రమణా గోవిందా అనే నామ స్మరణ చేస్తే ఏడేడు జన్మల పాపాలు సమసిపోతాయని భోగి గణపతిపీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం పీఠంలో శ్రీవారి పాదాల వద్ద సహస్ర నామాలతో 25వ జపయజ్ఞ పారాయణ జరిగింది. శ్రీవారి భక్త సమాజం సభ్యులు పాల్గొని సామూహిక సంకీర్తన చేశారు. రమణ రాజు మాట్లాడుతూ శేషాద్రి, వేంకటాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, నీలాద్రి, వృషభాద్రి, నారాయణాద్రి కొండలపై వెలిసిన సప్తగిరీశుని స్మరణతో ఇహలోకంలో పుణ్య గతుల సాధనకు జ్ఞాన మార్గం కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమ స్థాపకుడు గీతామకరంద ప్రకాశకులు, విద్యా ప్రకాశనంద గిరి స్వామి 110వ జయంతి సందర్భంగా గురుపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి మంగతాయారు, గంగాభవాని, వైష్ణవి భారతిరెడ్డి, సత్యనారాయణ, శేఖర్‌ భూపాల్‌ పాల్గొన్నారు.



భోగి గణపతి పీఠంలో శ్రీవారి పాదాల వద్ద జపయజ్ఞ పారాయణ చేస్తున్న భక్తులు

నేటి నుంచి సముద్రంలో వేట నిషేధం

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద పెరిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వేట నిషేధం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని తుని మత్స్యశాఖాధికారి సీహెచ్‌ ఉమామహేశ్వరరావు శనివారం తెలిపారు. నాటు పడవలు మినహా మెకనైజ్డ్‌, మోటార్‌ బోట్లపై మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల రాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్‌ 13 వరకూ వేట నిషేధం అమలులో ఉంటుందన్నారు. మత్స్యకారులు వేట నిషేధం అమలుకు సహకరించాలని కోరారు.